# పనస అధరహో

- ప్రారంభ ధర బాగుందని రైతుల ఆనందం
- పాడేరు నియోజకవర్గంలో మూడు వేల హెక్టార్లలో సాగు



సింగర్భలో విరగ్గాసిన పనస చెట్టు





జి.మాడుగుల: నియోజకవర్గంలో పనస కాయల వ్యాపారం జోరందుకుంది. అనకాపల్లి, తుని, విశాఖపట్నం, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల నుంచి కూడా వర్తకులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ప్రారంభం ధర అదరహో అన్నట్టుగా ఉంది. వాతావరణం అనుకూలించడంతో గ్రామాల సమీపంలో గల అడవుల్లోను, గిరిజన రైతుల సొంత భూముల్లో గల పనస చెట్లు విరగ్గాసాయి. దీంతో వారపు సంతలకు, మండల కేంద్రాలకు వాహనాల్లో, మోత బరువుతో తరలించి విక్రయిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు ఇక్కడ కొనుగోలు చేసిన పనకాయలను మైదాన ప్రాంత మార్కెట్‌లకు తరలించి, విక్రయించి అధిక ఆదాయం పొందుతున్నారు. గిట్టుబాటు ధర గిట్టుబాటు ధర లభిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పనసకాయ సైజును బట్టి రూ.50 నుంచి రూ.100 ధర పలుకుతోంది. వ్యాపారులు గ్రామాలకు వెళ్లి పనస కాయలు కొనుగోలు చేసి వ్యాన్లు, జీపుల్లో నర్సీపట్నం, తుని, రాజమండ్రి, అనకాపల్లి , విశాఖపట్నం తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. నియోజకవర్గంలో పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల్లో సుమారు 3వేల హెక్టార్లలో నాలుగు వేల మంది రైతులు పనసను పండిస్తున్నారు. ఈ సీజన్‌లో సుమారు రూ.50 లక్షల నుంచి రూ.60లక్షల వరకు వ్యాపార లావాదేవీలు ఉంటాయని రైతులు అంచనా వేస్తున్నారు.



విక్రయించడానికి వారపు సంతకు తీసుకొచ్చిన పనసకాయలు

### దిగుబడి బాగుంది



ఈ ఏడాది అన్ని పంటల్లాగే గిరిజన ప్రాంతాల్లో పనస దిగుబడి బాగుంది. ప్రారంభ ధర కూడా వారపుసంతల్లో బాగానే పలుకుతోంది.మా భూముల్లో గల కజ్జా, బురద రకం పనసచెట్లు విరగ్గాకాసాయి. రెండు రకాల పనసకాయలకు గిట్టుబాటు ధర లభిస్తుందన్న ఆశాభావంతో ఉన్నాం.

–వంత్లాబు దేముళ్లనాయుడు, పనసరైతు, గొడ్డుబూసులు గ్రామం

### కాయలు, పిక్కలు విక్రయిస్తాం



ఈ ఏడాది మంచి దిగుబడి వచ్చింది. కజ్జా, బురద రకాల పనస చెట్లు ఉన్నాయి. మాకు ఉన్న కొన్ని కజ్జా పనస చెట్లు నుంచి 50 పనస కాయలు కోసి విక్రయించగా రూ.4వేలు ఆదాయం వచ్చింది. మిగతా చెట్ల నుంచి సుమారు 10 వేలు వరకు ఆదాయం వస్తుంది. బురద పనస నుంచి పిక్కలు సేకరించి విక్రయిస్తాం. వాటి ద్వారా కూడా కొంత ఆదాయం వస్తుంది.

–సుబ్బారావు, పనసరైతు, ఎస్.పెదబయలు, జి.మాడుగుల

### సైజును బట్టి ధర

కజ్జా పనసకు సైజును బట్టి ధర చెల్లిస్తున్నాం. గిట్టుబాటు ధర చెల్లించి గిరిజన రైతుల నుంచి పనసకాయలు కొనుగోలు చేస్తున్నాం. తుని, రాజమండ్రి మార్కెట్‌లకు తరలించి రిటైల్‌గా, టోకుగా విక్రయిస్తాం.అన్ని ఖర్చులు పోను లోడ్‌కు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు లాభం వస్తుంది.

– రాంనాయుడు, పనసకాయల వ్యాపారి, తుని

## క్లుప్తంగా

### ముగిసిన హనుమాన్ జయంతి ఉత్సవాలు



అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

గంగవరం : స్థానిక హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఆలయ కమిటీ సభ్యులు సిద్ధూ, రాంబాబు, రాజు తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కలుముల అక్కమ్మ, మాజీ ఎంపీటీసీ బుల్లియమ్మ, వీవో లీడర్ రమణమ్మ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### నేడు శాకాహార ప్రాముఖ్యతపై ర్యాలీ

కొయ్యూరు: శాకాహర ప్రాముఖ్యతను వివరిస్తూ బుధవారం మండల కేంద్రం రాజేంద్రపాలెంలో ర్యాలీ నిర్వహించనున్నట్టు భీమసింగి పాకలపాటి గురుదేవుల ఆశ్రమం,రామభాణం యూత్ నిర్వాహకులు దేవీ,రజిత,జిల్లా కన్వీనర్ ఎం.త్రిమూర్తులు, కో కన్వీనర్ సుభద్ర కొయ్యూరు కన్వీనర్ సత్యహరికృష్ణ, బి.లక్ష్మి మంగళవారం తెలిపారు.శాకాహార ప్రియులుర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### విద్యుత్ షాక్‌తో దుక్కిటెద్దు మృతి



గూడెంకొత్తవీధి: గాలికొండ పంచాయతీ సప్పర్ల కొత్తూరులో విద్యుత్ షాక్‌తో ఓ దుక్కిటెద్దు మృతి చెందింది. సోమవారం అర్ధరాత్రి వర్షం పడడంతో గ్రామంలో కించే నాగేశ్వరరావుకు చెందిన ఎద్దు ఓ తాటాకుల పాకలోకి వెళుతున్న సమయంలో విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై మరణించింది. ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని బాధితుడు కోరాడు.

### ప్రతి పంచాయతీలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి



ఆధార్ కేంద్రం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు

గూడెంకొత్తవీధి: ప్రతి పంచాయతీలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గిరిప్రసాద్ కోరారు. ఆధార్ కేంద్రాలను పరిశీలించి, గిరిజనులు పడుతున్న అవస్థలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. తగినన్ని ఆధార్ కేంద్రాలు లేక మండల వాసులు ఇక్కట్లకు గురవుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు అరుణ్, చంటిబాబు,పరమేష్ పాల్గొన్నారు.

### కొనసాగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు



వేసవి విజ్ఞాన తరగతుల్లో పాల్గొన్న బాలబాలికలు

గంగవరం : స్థానిక శాఖా గ్రంథాలయంలో గత నెల 28 నుంచి వేసవి విజ్ఞాన తరగతులను విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు లైబ్రేరియన్ గంగాభవానీ తెలిపారు. మంగళవారం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారని, ఈ తరగతులు వచ్చే నెల ఆరో తేదీ వరకు నిర్వహిస్తామని ఆమె చెప్పారు.

### వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

వీఆర్‌పురం: ఆంధ్ర వనవాసీ ఆశ్రమం ఆధ్వర్యంలో స్థానిక కోట మైసమ్మ అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నెల 26వ తేదీనుంచి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కోర్డినేటర్ ఐ.వి. ప్రసాద్, బాగుల రాజారావు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## జీవో నంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలి



నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

చింతూరు: ప్రభుత్వం ఏజెన్సీప్రాంత ఉద్యోగ నియామక చట్టాన్ని వెంటనే ప్రకటించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్ డిమాండ్ చేశారు. స్థానిక ఐటీడీఏ ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాహార దీక్షల్లో భాగంగా మంగళవారం దీక్షలను బీజేపీ జిల్లా కార్యదర్శి పాయం వెంకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ 2025 డీఎస్సీ నుంచి ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ టీచర్ల పోస్టులను మినహాయించి, తక్షణమే వందశాతం స్థానిక ఆదివాసీ నిరుద్యోగులతో భర్తీచేయాలని కోరారు. జీవో నంబర్ 3కు చట్టబద్ధత కల్పిస్తామని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని, వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి నరేష్, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు కారం సాయి, శీలం తమ్మయ్య, లక్ష్మణ్, చందు, రాజు, మహేష్ పాల్గొన్నారు.

## ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ జిల్లా నాయకులు

పాడేరు రూరల్: ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ జిల్లా కన్వీనర్ ధర్మన్న పడాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ జిల్లా సభ్యులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ పిలుపు మేరకు ఈనెల 29న అన్ని మండల కేంద్రాల్లో బిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ఉద్యోగలు,విద్యార్థులు, మేధావులు, స్వచ్ఛంద సంస్థల, ప్రజా సంఘాల సభ్యులు, అన్నివర్గల ప్రజలు పాల్గొనాలని కోరారు. గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణతో పాటు ప్రత్యేక డిమాండ్లను పరిష్కరించే వరకూ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ కో కన్వీనర్లు రాధాకృష్ణ, భాను, సుందరరావు, జీవన్‌కృష్ణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపూదేడును సారారహితంగా తీర్చిదిద్దుతాం

సాక్షి ఎఫెక్ట్..



ఆదివాసీ మహిళలను అభినందిస్తున్న ఎక్సైజ్ సీఐ శ్రీధర్

రాజవొమ్మంగి: మండలంలోని లోదొడ్డి పంచాయతీ కొత్తపూదేడు గ్రామాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామని ఎక్సైజ్ సీఐ శ్రీధర్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈనెల 26న ‘కొత్తపూదేడులో సారా జోరు ’ అనే శీర్షికను ‘సాక్షి’లో వార్త ప్రచురించిన విషయం తెలిసిందే. దీంతో తమ గ్రామంలో సారాను అరికట్టాలంటూ ఆదివాసీ మహిళలు జడ్డంగి స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ చిన్నబాబుకు ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన ఎక్సైజ్ అధికారులు మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొత్తపూదేడు గ్రామాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామని, ఈ ప్రాంతంలో సారాను సమూలంగా అరికడతామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. సారా అరికట్టాలంటూ ముందుకు వచ్చిన మహిళలను ఎక్సైజ్ సీఐ అభినందించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుళ్లు నాయుడు, మూర్తి, దొరబాబు, శ్రీనివాస్, స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

### ● నిజం.. నమ్మండి ఇది రోడ్డే



బురద మయంగా మారిన అంతర్‌రాష్ట్ర రహదారి

అంతర్‌రాష్ట్ర రహదారి ఎంత అధ్వానంగా తయారయిందో చెప్పేందుకు ఈ చిత్రం నిదర్శనం. నాలుగు రాష్ట్రాలను కలుపుతూ నిర్మించిన ఈ రోడ్డు చిన్నపాటి వర్షం కురిసినా నాట్లు వేసేందుకు సిద్ధం చేసిన పొలంలా బురదమయంగా మారిపోతోంది. దీంతో నిత్యం ప్రయాణికులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ఆర్‌వీ నగర్ నుంచి పాలగెడ్డ వరకు దాదాపు 50 కిలోమీటర్ల పాడవైన రహదారి గత డిసెంబర్‌లో కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి ఇచ్చిన హామీ నీటిమీద రాత అయింది. ఇప్పటికైనా పాలకులు స్పందించి కొత్తరోడ్డు వేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

– జీకే వీధి

## విద్యార్థులందరికీ గురుకులాల్లో ప్రవేశాలు కల్పించాలి



పాడేరులో కౌన్సెలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన విద్యార్థి సంఘం నేతలు

పాడేరు రూరల్: గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులందరికీ ప్రవేశాలు కల్పించాలని, సీట్ల కేటాయింపులో జాప్యం చేయవద్దని ఏఐఎస్ఎఫ్ నేతలు కోరారు. పాడేరులో కౌన్సెలింగ్ కేంద్రాన్ని వారు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గిరిజనప్రాంతంలో అవసరమైన గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు డానియాల్ తదితరులు పాల్గొన్నారు.

## కిలగాడలో భారీ అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ పంచాయతీ కేంద్రంలో రాల మోదకొండమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన భారీ అన్నసమారాధనకు విశేష స్పందన లభించింది. పలు గ్రామాలకు చెందిన మూడు వేల మంది భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు.స్థానిక ఎస్ఐ రామకృష్ణ,సర్పంచ్ శివశంకర్,ఉత్సవ కమిటీ చైర్మన్ సురేష్,కోశాధికారి చంద్రుపడాల్,ఆలయ ధర్మకర్త రామనూజులు భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న గంగవరం ఎంపీడీవో లక్ష్మణరావు



కొయ్యూరు ఎంపీడీవో కార్యాలయంలో యోగా చేస్తున్న సిబ్బంది



చింతపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు, వైద్యాధికారి ఉదయసందీప్



అడ్డతీగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు



ర్యాలీలో పాల్గొన్న కొయ్యూరు ఎంపీడీవో ప్రసాద్, ఎంఈవో, అధికారులు



హుకుంపేటలో యోగ కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు,సర్పంచ్‌లు



వై.రామవరంలో యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర



ముంచంగిపుట్టులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు,ప్రజాప్రతినిధులు



రాజవొమ్మంగిలో యోగా శిక్షణలో పాల్గొన్న ఎంపీపీ వెంకటలక్ష్మి, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

చింతపల్లి: యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని చింతపల్లి ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు.యోగా పట్ల అవగాహన కల్పిస్తూ మంగళవారం చింతపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా మండల పరిషత్ సమావేశ మందిరంలో యోగా ట్రైనర్‌లతో ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తాజంగి వైద్యాధికారి ఉదయ సందీప్,యోగా గురు మోహనరావు తదతరులు పాల్గొన్నారు.

గంగవరం : మండలం కేంద్రం గంగవరంలో ఎంపీడీవో వై.లక్ష్మణరావు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లక్ష్మణరావు పలు యోగాసనాలు వేసి అందర్నీ ఆకట్టుకున్నారు. డిప్యూటీ ఎంపీడీవో నరసింగరావు, ఏపీవో ప్రకాష్, ఏపీఎం షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో యోగాంధ్రపై రెవెన్యూ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఆర్ఐ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: యోగాంధ్రలోభాగంగా మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి యోగాసనాలు వేశారు. అనంతరం రాజేంద్రపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 నాగభూషణం,ఏపీవో అప్పలరాజు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

హుకుంపేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమాదేవి ఆధ్వర్యంలో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో లవరాజు,డీఎల్‌పీవో కుమార్ యోగసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో కె.బాపన్నదొర అధ్యక్షతన యోగాంధ్ర కార్యక్రమం, గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ డి. శివకుమార్, ఆయుష్ వైద్యాధికారి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: యోగా మానసికంగా ఉత్తేజాన్ని ఇచ్చి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుందని అడ్డతీగల ఈవోపీఆర్డీ చిన్నబాబు అన్నారు.వివిధ శాఖల అధికారులు, సచివాలయాల సిబ్బందితో కలసి మంగళవారం అడ్డతీగలలో యోగాంధ్ర అవగాహన కార్యక్రమం, అనంతరం ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగా గురువు వేణుం వెంకటరత్నం యోగాసనాలను నేర్పించారు.

ముంచంగిపుట్టు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ అరిసెల సీతమ్మ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో యోగా తరగతులు నిర్వహించారు.యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై మండల కేంద్రంలో అవగాహన ర్యాలీని ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పలుశాఖల అధికారులు,సిబ్బంది నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ సీతమ్మ మాట్లాడుతూ యోగాతో ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కళావతి,సీడీపీవో వరహాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

### యోగాతో మానసిక ఉల్లాసం

రాజవొమ్మంగి: ప్రతి రోజు యోగా చేయడం ద్వారా మంచి ఆరోగ్యం, మానసిక ఉల్లాసం లభిస్తాయని రాజవొమ్మంగి ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అన్నారు. మంగళవారం సచివాలయంలో జరిగిన యోగా శిక్షణ తరగతుల్లో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎంపీడీవో యాదగిరీశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగా చేయాలన్నారు. వెలుగు ఏపీఎం రామాంజనేయులు, కార్యదర్శి కాకర సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాస్టర్ మృతి

చింతపల్లి: మండలంలోని బైలుకించంగి గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన పాస్టర్ తాంగుల బొజ్జన్నదొర(62) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివాసీ ప్రభావిత పథం చర్చి పాస్టర్‌గా పనిచేస్తున్న బొజ్జన్నదొర సోమవారం లుకించంగి గ్రామంలో ఆటో దిగి నడిచి వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బొజ్జన్నదొరతో పాటు ద్విచక్రవాహన చోదకుడు బాబూరావు గాయపడ్డాడు. గాయపడిన ఇద్దర్నీ కేజీహెచ్‌కు తరలించగా వారిలో మంగళవారం బొజ్జన్నదొర మృతి చెందాడు.ఆయన మృతదేహాన్ని జి.మాడుగులు మండలం వనబం పాటు గ్రామానికి తరలించి బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

## ముగిసిన గంగమ్మతల్లి జాతర



ఘటాలను మోస్తున్న డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, భక్తులు



పూజలందుకున్న గంగమ్మతల్లి

సాక్షి,పాడేరు: మండలంలోని డోకులూరు పంచాయతీ కేంద్రంలో గిరిజనుల ఆరాధ్యదేవత గంగమ్మతల్లి మూడు రోజుల జాతర మంగళవారం సాయంత్రంతో ఘనంగా ముగిసింది.ఉత్సవాల చివరిరోజు గంగమ్మతల్లి ఉత్సవ విగ్రహం,పాదాలు,ఇత్తడి,మట్టి ఘటాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.గంగమ్మతల్లి విగ్రహానికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.సర్పంచ్ సన్నిబాబు,జిల్లా అంధత్వ నివారణ విభాగం అధికారి డాక్టర్ తమర్బ విశ్వేశ్వరనాయుడు,సీనియర్ ఉపాధ్యాయుడు పాంగి సత్యనారాయణ, న్యాయవాది తమర్బ ప్రసాద్‌నాయుడు ఈ ఉత్సవాలను పర్యవేక్షించారు.